# నాకు నచ్చిన నా కథ

1934 నుంచి 1964 వరకు ముప్ఫయి ఏళ్ళలో వ్రాసిన సుమారు 200 కథలలో నాకు నచ్చిన కథలు అని ఒకటి, రెండు కథలను ఏరి తియ్యడం, తక్కిన కథలకు అన్యాయం చెయ్యడమే. ఏనాడు వ్రాసిన కథ ఆనాడు నాకు నచ్చివుండకపోతే, ఏదో ఒక పత్రికకు పంపివుండేవాడిని కాదు. ఆ కథ తనకు నచ్చకపోతే, ఆ పత్రికా సంపాదకుడు అచ్చువేసివుండేవాడు కాదు. అయినా, కథలు వ్రాయడం మానివేసిన పది సంవత్సరాల తరువాత, ఆ కథలను చదివితే, "కోనేటి నిజం", "తెల్లవారుఝాము పాతాలు" అనే రెండు కథలను మొదటి శ్రేణిలో వుంచి, తక్కిన కథలను తరువాతి శ్రేణిలో వుంచుదామనిపించింది. "కోనేటి నిజం", "తెల్లవారుఝాము పాతాలు" రెండూ కూడా 1938లో వ్రాసినవి.

— కప్పగంతుల సత్యనారాయణ.

# తెల్లవారుఝాము పాతాలు

శోభనమయిన క్రొత్తలో, బి.ఏ. పరీక్ష ప్యాసయిన కబురు తెలిసి, గోపాలరావూ అతని భార్యాయేకాకుండా, రెండువైపుల బంధువులుకూడా పొంగిపోయారు. చచ్చి చెడి చదివినవాడు గోపాలరావే అయినా, "ఇంతకీ అన్నపూర్ణ అదృష్టం" అంటూ అదృష్టంమాత్రం అతని భార్యకి అంటగట్టారు బంధువులందరూను. శోభనపు శృంగారంలో మునిగితేలుతూ వున్న గోపాలరావుకి తను పరీక్ష ప్యాసయిన వార్త సహజంగా సంతోషాన్ని కలిగించినా, ఓ విధమయిన బెంగనుకూడా కలిగించింది.

ఇంకముందు ఏం చెయ్యడం, బి.ఏ. పరీక్ష అయిందికదా అని ఏ ఉద్యోగానికైనా ప్రయత్నిద్దామా అంటే, ఎంత ప్రయత్నించినా ఏమీ దారికే ఆశ కనపడలేదు. అంచేత కమ్మగా భార్యతో కాపరంచేస్తూ ఉందామంటే —

బాగానే వుంటుంది కాని, అతని నాన్న మాత్రం అందుకు వొప్పుకోలేదు. "చేతనయితే యేదయినా ఉద్యోగం యిప్పుడే ఝటుకున సంపాదించు, లేకపోతే,

ప్లీడరీకో, డాక్టరీకో చదువు ఆరంభించు," అని ఖండితంగా చెప్పేశాడు. గోపాలరావు చదువుకుంటానంటే, అందుకయే ఖర్చు యెంతయినా సరే, భరించడానికి అతడు సిద్ధంగా వున్నాడు.

అలాంటప్పుడు, చదవడానికి ఎవడికి యిష్టముండదు. చచ్చిచెడి చదివినా, ఒక్క ముక్కకూడా వంటబట్టని శుద్ధమొద్దుకి కూడా చదువుకుందాము కులాసాగా అని వుంటుంది. ఇహ, కొంచెం తెలివయినవాడూ, శ్రద్ధగలవాడూ ఐన గోపాలరావు చదువుకోవాలనే వూసుకున్నాడంటే ఆశ్చర్యమేమీ లేదు.

మళ్ళీ ఒక సందేహం వచ్చింది, ప్లీడరీకి చదవడమా? డాక్టరికి చదవడమా? ప్లీడరీ అయితే రెండేళ్ళలో అయిపోతుంది. డాక్టరీ అయిదేళ్ళు పడుతుంది. ప్లీడరీ ఐతే, పార్టీలు తనయింటికి వస్తారు. బోలెడు డబ్బు సంపాదించవచ్చును. తెలివితేటలుంటే, సర్ అల్లాడి కృష్ణస్వామయ్యరంత గొప్పవాడు కావచ్చును. డాక్టరీ ఐతే డబ్బువచ్చినా పాడుచాకిరీ చెయ్యాలి. కాస్తా కూస్తా ప్రతిష్ఠ వచ్చినా పదవిరాదు. ఇలా ఇన్ని ఆలోచనలతో, చివరికి ప్లీడరికి చదవడానికే నిశ్చయించుకున్నాడు. అంతవరకూ ధోరణి బాగానే వెళ్ళింది. కాని ఇంకో సందేహం వచ్చింది. వెళ్ళితే చదువుకి చెన్నపట్నం వెళ్ళాలి. కాని, క్రొత్తగా కాపురానికి వచ్చి, శృంగార రసాన్ని రుచిచూపిస్తూవున్న అన్నపూర్ణమాట తలచుకొనేటప్పటికి —— మళ్ళీ అతనికి ఆలోచనలు ఆరంభమయాయి. అన్నపూర్ణను తీసుకొని వెళ్ళడమా, మానడమా?

వదలిపెట్టి వుండడం దుస్సాధ్యంగా తోచింది. తీసుకువెడితే, కాపురం పెట్టాలి. చదువు సరిగ్గా సాగుతుందో సాగదో ——

"మరి నేను సెలవలయాక, చెన్నపట్నములో చదువుకు వెడుతున్నాను. నువ్వు కూడా వస్తావా? ఇక్కడే వుంటావా?" అని అన్నపూర్ణను అడిగాడు, అన్నపూర్ణకి యింకా అతనిదగ్గర సిగ్గు పూర్తిగా వదలలేదు. తలవంచి, అతని నడుము చుట్టూ చేతులు పెనవేసి, "నే నొక్కదాన్నీ ఇక్కడ వుండనా" అంది.

"ఏం ఏం, అమ్మా, మీ నాన్న, చెల్లెళ్ళు, అన్నయ్యా, ఇంతమంది ఉండగా?"

"ఏమో, మిమ్మల్ని విడచి ఇంక ఒక్క నిముషమైనా వుండలేను బాబూ," అంటూ కళ్ళు కొంచెం పైకియెత్తి, ఏం చెప్తాడో అన్నట్టు అతని కళ్ళకేసి చూసింది. ఆ చూపుకి అతడు పరవశుడయాడు. ఆమె చెప్పినదంతా నిజమే ననిపించింది. నిజంగా ఆమె తనను వదలిపెట్టి ఒక్క నిముషంగూడా వుండలేదు. అలాంటి ప్రియురాలిని వదలిపెట్టి తను మాత్రం ఒక్క నిముషమైనా యెలా ఉండగలడూ?

అన్నపూర్ణను తీసుకొని వెళ్లవలసిందేనని నిశ్చయించుకున్నాడు. తన తండ్రి తోటీ, ఆమె తండ్రితోటీ యీ సంగతి చెప్పి యిద్దరినీ ఒప్పించాడు.

కావలసిన సామానులన్నీ సర్దుకొని, అవసరమైనంత డబ్బూ తీసుకొని, భార్యాభర్త లిద్దరూ పట్నం ప్రయాణమయారు. దసరా సెలవులు యివ్వగానే మళ్ళీ వస్తామని తన తండ్రికీ ఆమె తండ్రికీ, ఉత్తరాలు వ్రాస్తూ వుండమని ఆమె తండ్రికీ, తను ఉత్తరం వ్రాయగానే కావలసిన డబ్బు పంపుతూవుండమని తన తండ్రికీ చెపుతుండగా రైలు కదిలింది. వియ్యంకు లిద్దరూ ఇంటిదారి పట్టారు. రైలు చెన్నపట్నందారి పట్టింది.


రయిలు బయలుదేరింది మొదలు దారిపొడుగునా, ప్రతి స్టేషనులోనూ, అరటి పండ్లో, నారింజపండ్లో, ద్రాక్షపండ్లో, ఏవో వొకటి కొనుక్కుంటూ, తింటూ కబుర్లుచెప్పుకుంటూ, నవ్వుకుంటూ వీళ్లు కాలం గడిపివేశారు. వీళ్లు రాజమండ్రిలో బండి యెక్కింది మొదలు చెన్నపట్నంలో దిగేవరకుకూడా, ఆ పెట్టెలో యెక్కినవాళ్ళందరి కళ్లూ వీళ్లమీదే వున్నాయి.

రయిలు దిగగానే, హోటలుకి వెళ్ళి, సామానంతా అక్కడవేసి, సాయంత్రం కాగానే యిద్దరూ కలిసి, ట్రిప్లికేనులో యిల్లు వెతకడానికి బయలుదేరారు. రిక్షాలో యెక్కి కూచున్నాక, గోపాలరావు యిలా అన్నాడు. "చూడు, మనం వంట, వడ్డనా పెట్టుకొని తూగలేము. హాయిగా క్యారియరులో పెట్టించి హోటలు నుంచి తెప్పించుకుందాము. పగలు నేను కాలేజికి వెళ్లినప్పుడు నువ్వు పత్రికలూ నవలలూ చదువుకుంటూ వుందుగాని."

సంతోషంతో వొప్పుకుంది అన్నపూర్ణ. ఒకేవొక పెద్దగదీ, గదికి వెనకవైపున చిన్న వరండా వున్న మేడమీదిభాగం అద్దెకి తీసుకున్నారు. ఆ గదిని చదువులకీ పడకకీ ఉపయోగించుకుందుకి నిర్ణయించి, అడ్వాన్సు యిచ్చివేసి, ఆ రాత్రికే వచ్చి ఆ భాగంలో చేరారు.

మరునాడు, గోపాలరావు కాలేజికి వెళ్లి, జీతం కట్టివేసి, కొనవలసిన పుస్తకాలన్నీ క్రొత్తవి కొనుక్కొని సాయంత్రం యింటికి వచ్చాడు. సాయంత్రం గోపాలరావూ అన్నపూర్ణా యిద్దరూ బీచికి వెళ్ళారు. ఎనిమిది గంటలదాకా బీచిలో షికారుచేసి, అయ్యరు తెచ్చిన భోజనం తినివేసి, క్యాంపుకాటుమీద కమ్మగా కౌగలించుకొని పడుకున్నారు.

మరునాటినుంచీ, గోపాలరావు శ్రద్ధగా స్కూలుకు వెళ్లడం ఆరంభించాడు. వారంరోజులు మామూలు ప్రకారమే గడిచాయి. కాలేజిలో మాత్రం, పాఠాలు గబగబా చెప్పుకొనిపోతున్నారు, ప్రొఫెసరు.




ఈ వారంరోజులలోనూ, ఒక్కరోజు అయినా, గోపాలరావు పుస్తకాన్ని ముట్టిన పాపాన పోలేదు. కాని, అతను మొదటినుంచీ కూడా చాలా శ్రద్ధగల మనిషి. ఏరోజు పాఠాలు ఆరోజున చదవడము, అతనికి చిన్నప్పటినుంచి అలవాటు. అలా చదవకపోతే పరీక్షలముందు చాలా కష్టపడి చదవవలసివస్తుందనీ, ఒకవేళ చదివినా పరీక్ష ప్యాసుకావడం అనుమానమేనని అతనికి భయం.

అంచేత ఒక వారంరోజులు గడిచిన తరువాత, ఈ విషయంలో యేదో ఆలోచన చేసుకోవాలనుకున్నాడు. ప్రతిరోజూ రాత్రి పదిగంటలవరకూ చదువుదామని నిశ్చయించుకున్నాడు.

క్యారియర్‌లో వచ్చిన భోజనాన్ని యిద్దరూ పెట్టుకొని తిన్నారు. అన్నపూర్ణ గిన్నెలన్నీ సర్దుకుంటూ వుండగా, గోపాలరావు చదువుకి కూచున్నాడు. ఒక పేజీ చదివినట్టున్నాడు. అన్నపూర్ణ గదిలోకి వచ్చింది. సాయంత్రం తలలో పెట్టుకొన్న సన్నజాజి పూలవాసన, ఆ గదిలో వున్న నిర్జీవమైన వస్తువులకి కూడా ఉద్రేకాన్ని కలిగించింది. బీచి వైపునుంచి తెరలు తెరలుగా రివ్వుమని వస్తూ వున్న గాలి, ఆ ఉద్రేకానికి దోహదమిచ్చింది. గోపాలరావు అన్నపూర్ణవైపు చూశాడు. అన్నపూర్ణ మాత్రం గోపాలరావు తనవైపు చూస్తున్న సంగతి గమనించకుండానే, గోడకి తగిలించి వుంచిన అద్దం దగ్గిరికివెళ్లి చెంపలూ చెక్కిళ్ళూ సవరించుకొని మెల్లిగా వెళ్లి పక్కమీదికి వొరిగింది. గోపాలరావు

చేతిలో వున్న పుస్తకం మూసివేసి, 'ఇప్పుడేం చదువు, హాయిగా, తెల్లవారు ఝామున చదువుకోవచ్చు!' అంటూ అలారం గడియారం తీసి మూడున్నరకి అలారం పెట్టి ఒక్క దూకున అన్నపూర్ణ ప్రక్కన చేరాడు.

గణగణమంటూ, సరిగ్గా మూడున్నరకి గడియారం అలారం కొట్టేసింది. వెంటనే నిద్రలేచాడు గోపాలరావు. లేస్తూనే లైటువేసుకొని, కూజాలో వున్న చన్నీళ్ళతో మొహం కడుగుకొని, చదువుకి కూచున్నాడు.

పుస్తకం రెండుచేతులతోటీ తెరుస్తూ అటు ప్రక్కమీద పడుకునివున్న అన్నపూర్ణకేసి చూశాడు. రాత్రి భర్తతో గడిపిన ఆనందమువల్లా, చీకూచింతా కల్మషమూలేని నిర్మలమయిన హృదయమువల్లా, హాయిగా నిద్రపోతోంది అన్నపూర్ణ. ఆమె పెదవులు నిద్రలోకూడా కమ్మని చిరునవ్వును ప్రదర్శిస్తున్నాయి. నిద్రలోకూడా ఆమె ముఖం అత్యంత ఆహ్లాదకరంగా, ప్రసన్నంగా వున్నది. జుట్టు బాగా రేగి, ముందరిపైపున ముంగురులు, నుదుటిమీద ఉంగరాలలా చుట్టుకొనివున్నాయి. జాజిపూలవాసన గుమ్మనిపిస్తోంది యింకానూ. ఆ తియ్యటివాసనా, పద్మంలాంటి ఆ ముఖమూ చూచి భ్రమపడి తుమ్మెదలువచ్చి వ్రాలాయా అనిపిస్తున్నాయి ఆ ముంగురులు.

గోపాలరావుకి యిక చదువుమీద ధ్యానంపోలేదు. తీసిన పుస్తకాన్ని తీసి నట్టే బల్లమీద పెట్టి, అన్నపూర్ణ మొహంమీద మొహంపెట్టి గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. "ఏమిటదీ...." అంటూ అన్నపూర్ణ మెల్లిగా కళ్ళుతెరిచింది.

"మళ్ళీనీ" అంటూ గోపాలరావు లైటు ఆర్పివేశాడు.

ప్రతిరోజూ యిలాగే జరగడం ఆరంభమయింది. పగలంతా, రాత్రి చదువుకుందామనుకోవడమూ, రాత్రి అయేసరికి తెల్లవారుఝామున చదువుకుందాములే, యివ్వాళకి లేకపోతే ఏమనుకుంటూ, మళ్ళీ.... ఇలా వారంరోజులు జరిగింది. అన్నపూర్ణకి ఆశ్చర్యం వేసింది. పైగా రాత్రి పదకొండున్నరదాకానూ తెల్లవారుఝామున మూడన్నరనుంచీ మేలుకోవలసి వచ్చినందువల్ల పాపం ఆమెకి నిద్రకూడా చాలడంలేదు.

ఓరోజున, మామూలు ప్రకారం రాత్రిపూట అయినతరువాత గోపాలరావు అలారం పెట్టబోతూవుండగా అన్నపూర్ణ "ఏమండీ! పదకొండున్నర అయిందా యిప్పుడూ—మళ్ళీ తెల్లవారుఝామున యేమిటండీ — నాకు యీ పదిరోజుల నుంచీ నిద్ర బొత్తిగా చాలటంలేదండీ, ఏమండీ, ఆ తెల్లవారుఝాముపాఠాలు కూడా యిప్పుడే చదివెయ్యండీ " అలాగంది.

తెల్లబోయిన అతనిమొహం, లైటు తెలుపులో మరింత తెల్లబడింది.

---